## కథల వర్క్‌షాప్-5 (వరదలొచ్చాయి) కథ-2

# సంకల్పం



భూదిపెద్ది సత్యలక్ష్మి

వర్షం తగ్గేట్టులేదు ఎలాగోలా శాస్త్రి గారింటికెళ్లి చెప్పేసి రండి అంటూ గొడుగు అవధానిగారి కందించింది ఆదిలక్ష్మమ్మ.

ఊ... అంటూ నీరసంగా వాలుకుర్చీ లోంచి, తప్పదన్నట్టుగా లేచి, కండువా బుజాన్నేసుకుని, వర్షంకేసి చూసి, నిట్టూరుస్తూ, తలుపేసుకో వెళ్లొస్తా నన్నారు అవధానిగారు.

అరవై సంవత్సరాల వయస్సు అవధానిగారికి. అంతకు ఓ అయిదు సం.రాలు తక్కువ ఆదిలక్ష్మమ్మగారికీ ఉంటాయి. రెండేళ్లక్రితమే అవధానిగారు మేస్త్రీ వృత్తి నుండి రిటైరై ఆ వూర్లో స్థిరపడ్డారు. శ్రోత్రియమైన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కారణంచేత ఆయన పాత పద్ధతులకీ, పూజా పునస్కారాలకీ ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. త్రికాల సంధ్యావందనం. గీతా పారాయణం ఆయన నిత్య దైనందిన జీవితంలో ముఖ్య భాగాలు. అందుకు తగ్గట్టుగా, ఆదిలక్ష్మమ్మగారుకూడా మడీ, తడీ, ఆచారాలన్నీ పాటిస్తారు.

అవధానిగారు తండ్రి ఆబ్దీకం ఆ రోజుకి సరిగ్గా మూడు రోజులుంది. అందుకోసం అవసరమైన సరంజామా అంతా కొనుక్కుని సిద్ధంగా వుంచుకున్నారు. ప్రక్కనున్న రామచంద్రపురంనుండి భోక్తలుగా ఇద్దరు బ్రాహ్మల్ని పిలుచుకున్నారు. మంత్రానికి మాత్రం ఆ వూర్లోనే ప్రక్కవీధిలోనున్న శాస్త్రిగార్ని పిలవటానికి వర్షంలో బయల్దేరక తప్పలేదాయనకి.

అవధానిగార్ని శాస్త్రిగారు ఆనందంగా ఆహ్వానించారు. మంత్రానికి తప్పకుండా వస్తున్నట్లు మాట ఇచ్చారు. హమ్మయ్య ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి అనుకుంటూ వర్షంలో ఇంటిదారి పట్టారు.

తలుపు తీస్తూనే, శాస్త్రిగారున్నారా? మంత్రానికొస్తానన్నారా? అంటూ ప్రశ్నించారు ఆదిలక్ష్మమ్మగారు.

ఆయనొస్తానన్నార్లేగాని - వర్షంచూడు ఎలా పట్టుకుందో - కొంపదీసి ఎక్కడా వాయుగుండంగాని పెట్టలేదుకదా! అన్నారు.

అబ్బే! మామూలుముసురే అయుంటుంది - రేపటికి తెరిపిచ్చేస్తుంది లెండి అన్నారామె - ధైర్యం చెప్తున్నట్లుగా -

వాళ్లు అనుకున్నట్లు వర్షం తగ్గలేదు సరిగదా! ఆ రాత్రంతా ఉధృతంగా కురిసి, మర్నాటికి మరింత పెరిగి పోయింది. చుట్టుపట్ల కొన్ని ప్రాంతాలు ముంపుకి గురైనట్లు వర్తమానాలుకూడా రాసాగాయి. ఆ రాత్రంతా దంపతులు నిద్రపోకుండా - తద్దినం ఎలా జరుగుతుందనే ఆలోచించసాగారు.

అవధానిగారి పరిస్థితి చెప్పనేవద్దు - తెల్లవారితే తద్దినం - పరిస్థితి చూస్తే, వరద గ్రామాన్ని ముంచేసేట్టుంది. ఆ పరిస్థితుల్లో బ్రాహ్మలేంవస్తారు - తద్దినం అభాసయిపోతుందేమో! అని భయపడసాగారు.

ఆయన భయపడినంతా జరిగింది. అందరూ గ్రామం ఖాళీచేసి, ఎగువ ప్రాంతాలకి చేరుకోవల్సిందిగా కబురందింది. ఇంచుమించు గ్రామం అప్పటికే మూడొంతులు ఖాళీ అయిపోయింది. అందినంత సామగ్రి తీసుకుని అందరూ ఎగువ ప్రాంతానికి తరలిపోతున్నారు. అవధానిగోరూ - రండి - రండి - సామాన్లొగ్గేసి - ముందు ప్రాణాల్రచ్చించుకోండి - అంటూ కేకేసారు గ్రామస్థులు.

అప్పటికే ఆదిలక్ష్మమ్మ, రెండు గోనె సంచుల్లో సామాన్లు సర్దింది. మరికొన్ని అవధానిగారిచేతికందించింది - రెండు క్రోసుల దూరం చీకట్లో నడుచుకుంటూ మోయలేని భారంతో వర్షంలో తడుసుకుంటూ మెట్ట ప్రాంతానికి చేరుకొన్నారు.

ఆ ప్రాంతం అంతా పిల్లలూ, పెద్దలూ, ముసలీ, ముతకలతో భయాందోళనతో - ఏడ్పులతో రాలేక పోయిన తమ బంధుజనులకోసం గుండెలవిసేట్టు రోదిస్తూ కన్పించింది. అక్కడ అన్నిజాతుల ప్రజలూ ఉన్నారు. ఓ మూలన అవధానిగారు - అతని భార్య సామాన్లు దించుకున్నారు. రాత్రంతా అభాసుకాబోతున్న తండ్రి తద్దినాన్ని తలుచుకుని బాధపడ్డారు. తెల్లవారింది - దిగువ ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. చుట్టూ జలమయం. అక్కడక్కడా హృదయవిదారకంగా, శవాలు తేలుతున్నాయి. కొన్ని జంతువులు ఈదుకుంటూ వడ్డుకి చేరుకుంటున్నాయి. వర్షం మాత్రం ఇంకా కురుస్తూనే వుంది. రక్షణ శిబిరంలో ఎవరికీ గత రాత్రినుండీ, తిండీ తిప్పలు లేవు - పిల్లలూ, ముసలివాళ్లూ ఆకలికి చుట్టుకుపోతున్నారు. కొందరైతే పొట్టలు పట్టుకుని ఆకలని ఏడ్వసాగారు.

ఆదిలక్ష్మమ్మకి ఆ దృశ్యం చూసి గుండె తరుక్కుపోయింది. భర్తని పిలిచింది. తద్దినం సామాన్లు, కర్రలూ, విస్తర్లతోసహా తెచ్చాను - అంతా కల్సి ఏభైమంది ఉంటారు. కలిగినంత వండి వీళ్లకి పెట్టి మనం ఎంగిలిపడదాం. పితృదేవతలు తరిస్తారు. అంటూ వర్షంలో తడిసిన తడి చీరతో - మూడురాళ్లపేర్చి, పన్నెండు గంటలలోగా, చాలా మడిగా ఎంతో శ్రద్ధగా మూడు కూరలు - మూడు పిండి వంటలతో వంట పూర్తిచేసింది.

అవధానిగారు - అందరికీ విస్తర్లు వేశారు. దంపతులిద్దరూ వడ్డన చేసారు. ఆకలితో ఆవురావురుమని తింటూన్న అన్నార్తులకు జాతి, మతాల తేడాలేదు.

అంతా మనుషులే! హాయిగా తిని త్రేపులు మనిత్రేన్నారు. ఇలాంటి తద్దినం నభూతో నభవిష్యతి - అనుకున్నారా దంపతులు - తమకి తినటానికి ఒక్క మెతుకైనా మిగల్లేదన్న సంగతి తెల్సుకునేటందుకు వాళ్లకా ఆనందంలో ఆకలేస్తేగదా! ○